జయజయ శంకర



హరహర శంకర

సంపుటి : 2 సంచిక : 7&8

# శ్రీ కామకోటి వాణి

శ్రీ శోభకృత్ మాఘ & ఫాల్గున మాసం ఫిబ్రవరి - మార్చి 2024



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# శ్రీరాముని రూప విశేషాలు, పవిత్రమైన శ్రీరామజన్మభూమి విశిష్టత

**-"స్వామివారు భక్తి టీవీకి జనవరి 2024 న ఇచ్చిన ఇంటర్వ్యూ"**

**ప్రశ్న : పూజ్య గురూజీ! ప్రణామాలు! శ్రీరామచంద్ర ప్రభువు యొక్క రూప విశేషాలను మాకు తెలియ జేయగలరు!**

**స్వామివారు :** శ్రీరామచంద్రుడు మంచి సాముద్రికా లక్షణాలతో సూర్యవంశంలో పుట్టినవారు. 'వ్యూఢోరస్కః వృషస్కంధః, సాలంప్రాంశు మహాభుజః, ఆత్మకర్మక్షమం దేహమ్, క్షాత్రో ధర్మ ఇవాశ్రితః' అన్నట్లుగా వీరుడి లక్షణాలు, భక్తుడి లక్షణాలు కలుపుకొని సౌమ్యమైన సాత్విక స్వభావం కలిగిన వ్యక్తి రూపం ఎలా ఉంటుందో అలా ఏకీకృతంగా వచ్చిన స్వరూపం రాములవారు. వాల్మీకి మహర్షికి భూలోకంలో మంచివాళ్ళు ఎవరో తెలుసుకోవాలన్న ఆలోచన కలిగింది. త్రిలోక సంచారి అయిన నారదమహర్షిని అడిగారు. మంచిస్వభావం కలిగిన వీరుడు, అందమైనవాడు, మంచి వ్యక్తిత్వం కలిగినవాడు ఎవరని ప్రశ్నించగా

> *'నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవం*
> *కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్,*
> *ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః*
> *చారిత్రేణ చ కో యుక్తః'*

సదాచారం కలిగిన వీరుడు, గుణవంతుడైన మంచివ్యక్తి రాములవారు అని నారదులు తెలియజేశారు. అప్పుడు వాల్మీకిమహర్షికి



రాములవారి గురించి వ్రాయాలని ప్రేరణ కలిగి రామాయణం రచించారు. వాల్మీకి రచించిన రామచరితం అనేక భారతీయ భాషల్లోకి, విదేశీ భాషలలోకి కూడా అనువదించబడి ఇండోనేషియా వరకూ నేటికీ ప్రచారంలో ఉంది. కేవలం రూపసౌందర్యం కాకుండా గుణం, భక్తి, దానం, సౌమ్యతతో కూడిన సమస్త సౌందర్యానికి ప్రతీకగా శ్రీరామ స్వరూపం ఉంటుంది.

**ప్రశ్న : పవిత్ర రామజన్మభూమి యొక్క విశిష్టతను తెలియజేస్తారా స్వామి ?**

**స్వామివారు :** 'రామజన్మభూమి' అనేది పవిత్రమైన మృత్తిక అనుకోవాలి. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం మొదలైన పంచభూత సమన్వితమైన ఒక ప్రదేశం. శాస్త్రప్రకారం 'సముద్రవసనే దేవీ, పర్వత స్తనమండితే, విష్ణుపత్నీ నమస్తుభ్యమ్, పాదస్పర్శం క్షమస్వ మే' అని మనం ఉదయం లేవగానే భూదేవిని ప్రార్థిస్తూ, క్షమాపణ కోరుతూ మన పనులు, సుప్రభాతం ప్రారంభిస్తాం. భూమాత సహనశక్తి కలిగినది. ధరా ధరిత్రి ధరణిః అంటారు. ఈ భూలోకాన్ని ఆదిశేషుడు ధరించి ఉన్నారు. ఈ మృత్తిక యొక్క గౌరవాన్ని వేదం 'మృత్తికే దేహి మే పుష్టిం, మృత్తికే హర మే పాపం, మృత్తికే బ్రహ్మ దత్తాసి, కాశ్యపేన అభిమంత్రితా' అని వివరిస్తోంది. భారతదేశం పవిత్రమైన భూమి. పూర్వజన్మపుణ్య సుకృతం వల్ల నరజన్మ లభిస్తుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభం' అని శంకరాచార్యులు నరజన్మ గురించి వివేకచూడామణిలో చెప్పారు. అలాంటి జన్మ మంచిదిగా ఉండాలి. ప్రజలకి ఉపయోగపడుతూ ఈశ్వరానుగ్రహం పొందేలా ఉండాలి. దానికి మూడు కార్యక్రమాలు చెయ్యాలని శంకరాచార్యులవారు చెప్పారు. 'దుర్లభమ్ త్రయమేవ ఏతత్ దైవ అనుగ్రహ హేతుకమ్ మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః' మనిషి – మంచి స్వభావంతో కూడి ఉండాలి. కోరికలు ధర్మబద్ధంగా ఉండాలి. కోరికలే లేని మోక్షప్రాప్తిని పొందాలి.

రాములవారిది మహర్షితుల్యమైన, భగవంతుడి జన్మ. ఎక్కడో వైకుంఠంలో ఉండే భగవంతుడే భూలోకంలో అవతరించి, మనకి ఆశీర్వచనం ఇస్తున్నారు. రామ శబ్దం యొక్క అర్థం 'రమయతి ఇతి రామః'. (రమంతే యోగినః అస్మిన్ ఇతి రామః) ఆయన ఆశీర్వచనం భక్తి ముక్తి భుక్తి దాయకంగా కూడా ఉంటుంది. మనం మంచిదారిలో వెళ్తూ, సమయాన్ని, అవకాశాన్ని వ్యర్థం చేసుకోకుండా సదుపయోగం చేసుకోవడానికి వారి దర్శనం, చరిత్ర, మహాత్మ్యం, వారి నామజపం మంచిని కలిగిస్తాయి. కనుక వారి చరిత్ర మనసుకి ఆనందదాయకం. 'రామో రామో రామ ఇతి ప్రజానాం అభవన్ కథాః రామ భూతం జగదభూత్ రామే రాజ్యం ప్రశాసతి' రాజ్యంలో అందరూ రాముడు గురించి అనుకునేవారు. శ్రీమహాలక్ష్మి స్వరూపమైన సీతాదేవితో

కూడిన శ్రీరామజన్మభూమి కనుక భూమి విశేషంగా చెప్పబడింది. (వేదంలో దేవపురిగా, దేవతల నివాసస్థానంగా అయోధ్య గురించి గొప్పగా గౌరవంగా చెప్పారు. 'అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా పూరీ ద్వారవతీ చైవ సప్తైతాః మోక్షదాయకాః') అలాంటి గొప్ప క్షేత్రంలో, సరయూనదీ తీరంలో, యజ్ఞయాగాదులు ప్రోత్సహిస్తున్న సూర్యవంశంలో వీరు తేజస్విగా పుట్టడం జరిగింది.

**సంతాపఘ్నం సకల జగతాం శారఙ్గచాపాభిరామం**
**లక్ష్మీ విద్యుల్లసితమదసీగుచ్ఛసచ్ఛాయ కాయం**
**వైకుంఠాఖ్యం మునిజనమనశ్చాతకానాం శరణ్యం**
**కారుణ్యాపం త్రిదశపరిషత్ కాలమేఘం దదర్శ** అని దేవతలందరూ మహా విష్ణువు దగ్గరకు వెళ్ళి, సేవించుకుని, మీరు అవతరించి భూమిని కాపాడాలి అని కోరినందువల్ల దశరథుడు కౌసల్యాదేవి పుత్రుడిగా అయోధ్యలో జన్మించడం జరిగింది. జన్మభూమిలో రామ సందర్శనం చేసినప్పుడు మనకి చాలా సుఖం, పుణ్యం వస్తాయి. జన్మభూమి దర్శనమే గొప్పదని స్కాందపురాణంలో చెప్పబడింది. జన్మస్థానం అనేది మన పవిత్రభావనకు ముఖ్యం.



స్కాందపురాణంలో –

**యస్య దర్శనతో నృణాం విఘ్నలేశో న విద్యతే,**
**తస్మాత్ విఘ్నేశ్వరః పూజ్యః సర్వకామ ఫలప్రదః,**
**తస్మాత్ స్థానత ఐషాని రామజన్మ ప్రవర్తతే,**
**జన్మస్థానమిదం ప్రోక్తం మోక్షాది ఫలసాధనం.**
**విఘ్నేశ్వరాత్ పూర్వభాగే వాసిష్ఠాత్ ఉత్తరే తథా,**
**లౌమశాత్ పశ్చిమే భాగే జన్మస్థానం తతః స్మృతం.**
**యద్దృష్ట్వా చ మనుష్యస్య గర్భవాస జయో భవేత్.**

రాములవారు గర్భవాసం చేసి మానవుడుగా కౌసల్యాదేవికి జన్మించిన, ఆ చోటుని సందర్శిస్తే గర్భవాసం లేని ఒక మంచి మోక్షసామ్రాజ్యం మనకి కలుగుతుంది అని స్కాంద పురాణంలో ఉంది. తూర్పుభాగంలో విఘ్నేశ్వరగుడి, వశిష్ఠమహర్షి ఆశ్రమం, ఉత్తరంవైపు లౌమశమహర్షి ఆశ్రమం, పడమట జన్మస్థానం ఉన్నాయి.

**వినా దానేన తపసా వినా తీర్థైః వినా మఖైః**
**నవమీ దివసే ప్రాప్తే వ్రతధారీ హి మానవః**
**స్నానదాన ప్రభావేన ముచ్యతే జన్మ బంధనాత్**

దానం, తపస్సు, తీర్థాటనం, యజ్ఞయగాదుల వల్ల వచ్చే పుణ్యము శుక్లపక్ష నవమిరోజు రామ దర్శనం (జన్మతిథి) చేసుకుంటే వస్తుంది. పుణ్యస్థలాలకు టూరిస్ట్‌లాగా వెళ్ళకూడదు. అది మనవాళ్ళు గుర్తించవలసిన విషయం. కట్టు,బొట్టు, జుట్టు అన్నీ కూడా మన శాస్త్రసాంప్రదాయం ప్రకారం ఉండాలి. ముఖ్యంగా ఇలాంటి మహత్త్వపూర్ణమైన, యుగయుగాలుగా పవిత్రమైన స్థానానికి వెళ్ళినప్పుడు కాళ్ళుకడుక్కొని, బొట్టుపెట్టుకొని, సాంప్రదాయ వస్త్రధారణతో, ఆహార నియమాలతో వెళ్ళాలి. తీర్థక్షేత్రంగా చూసే పవిత్రభావన మనలో రావాలి. సరయూనదిలో స్నానం చేయాలి. ఎక్కడ స్నానం, దానం, జపం చేసే మంచివాళ్ళు, మహనీయులూ ఉంటారో అక్కడ అన్నదానం జరుగుతుంది. అంటే మన ధర్మం ఒక సామాజిక సాధనలా ఉండాలి. మనము, మనతోపాటు అందరూ బాగుండాలి అని కోరుకోవాలి. మంచి సదాచారం కలిగినవాళ్ళకి, మాతృ పితృ గురు శుశ్రూష చేసినవారికి, గొప్పగా కాశీయాత్ర చేసినవారికి ఎంత పుణ్యమో అంత గొప్పపుణ్యం రామజన్మభూమి సందర్శనం వల్ల వస్తుంది. అందుకని భక్తులందరూ పవిత్రమైన, అరుదైన ఈ అవకాశాన్ని వాడుకొని జన్మలో ఒకసారైనా రామజన్మభూమిని సందర్శనం చేసే ప్రయత్నం చేయాలి.

ప్రశ్న: పూజ్య గురువర్యా! ఆలయాలను ఎలా నిర్మిస్తారు? ఎటువంటి నియమాలు పాటిస్తారు?

**స్వామివారు : 'ఆగతం శివ వక్త్రేభ్యః గతం చ గిరిజాముఖే, మతం చ వాసుదేవస్య తస్మాత్ ఆగమ ముచ్యతే'** మనకు పురాణాలన్నీ లభించాయంటే, వింటున్నామంటే, మహాత్మ్యం తెలుసుకుంటున్నా మంటే దానికి ముఖ్యకారణం పార్వతీదేవి. ఆ తల్లి ప్రజలందరూ బాగుండాలి అని పరమేశ్వరునికి విన్నపం చేస్తూ స్వామిని మనకోసం అడిగింది. పార్వతీదేవి యొక్క ప్రేరణతో అనేక పురాణాలు మనకు అందాయి. మహావిష్ణువు కూడా దానికి అంగీకరించారు. 'మతం చ వాసుదేవస్య' అలా పార్వతీపరమేశ్వరులు, విష్ణుమూర్తి, ఆ ముగ్గురి ఆశీర్వచనంతో మనకి దివ్యగ్రంథాలైన ఆగమములు వచ్చాయి. ఆ ఆగమం ప్రకారం మనం ఆలయ నిర్మాణం చెయ్యాలి. ఎక్కడ, ఎలాంటి మట్టితో కట్టాలి అనే దాన్ని 'మృత్ సంగ్రహణం' అంటారు. 'కర్షణాది ప్రతిష్ఠాంతం' అంటే భూమిని హలాయుధంతో, ఆవులతో సరిచేసి పుట్టమట్టిగా దానిని తీసుకువచ్చి, పుష్కరిణి, ప్రసాదం పోటు, ఉత్సవ విగ్రహం, ధ్వజస్తంభం, బలిపీఠం, గర్భగుడి, అర్ధమండపం, మహామండపం, ప్రాకారం మొదలైన చోట్ల ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ఎలా ఉంచాలో నిర్ణయిస్తారు. ఒక్క గుడి మాత్రమే కాకుండా గుడికి మాడవీధి, రాజవీధి ఉండాలి. పంచప్రాకారాలు ఉండాలి. మనశాస్త్రంలో గర్భగుడి, అర్ధమండపం, మహామండపం నిర్మాణం చెప్పారు. మూలవిగ్రహానికి కూడా కొలతలు ఉంటాయి. (జంబుకేశ్వర క్షేత్రంలో అఖిలాండేశ్వరి అమ్మవారి చెవికి శంకరాచార్యులవారు శ్రీచక్ర రూపమైన తాటంక ప్రతిష్ఠ చేశారు. ఈ రోజుకి కూడా పార్వతీదేవి శివుణ్ణి పూజించే విధంగా చీర కట్టుకుని అర్చకస్వామివారు అమ్మవారి సన్నిధి నుంచి వెళ్ళి శివుణ్ణి పూజిస్తారు.) 'యవోదరైః అంగుళమష్టబిల్వ' – యవధాన్యం అని ఉంటుంది. ఆ ధాన్యం యొక్క కడుపు భాగం, 8 భాగాలు కలిస్తే అంగుళం అంటారు. అలా కొలతలు ఉంటాయి. ఇలాంటి సంఖ్య కొలతలు బట్టి విగ్రహాలను నిర్మిస్తారు. మరీచి, కాశ్యప లాంటి భారతీయ ప్రాచీన వైజ్ఞానికులు, మహర్షులు, ఆగమశాస్త్రం, శిల్పశాస్త్రం మనకు ఇచ్చారు. ఆ ప్రకారం నిర్మాణం చేసి భగవంతుడిని వేదమంత్రాలతో పిలవాలి. మన ధర్మానికి మూలం, ముఖ్యం, కేంద్రబిందువు వేదం. ఆ వేదమంత్రం ద్వారా ఆచార, ఆహార నియమాలు పాటించి, జపాలు, హోమాలు చేసి భగవంతుడిని సూర్యచంద్రులు ఉన్నంతకాలం శాశ్వతంగా, స్థిరంగా, సంతోషంగా, సుముఖంగా, సుప్రసన్నంగా సుముఖోభవ అవకుంఠితోభవ, స్థాపితోభవ అని ఆయనని ఇక్కడే ఉండమని కోరుకోవాలి. ప్రార్థనతో 'స్వామిన్ సర్వజగన్నాథా ! యావదాచంద్ర తారకం తావత్త్వం ప్రీతి భావేన బింబేస్మిన్ సన్నిధిం కురు' అని మూర్తిలో మీరుండి సూర్యచంద్రులు ఉన్నంతవరకు అనుగ్రహించాలని కోరుకుంటాము. దానినే ప్రతిష్ఠ అంటారు. ఇప్పుడు మన దేశానికి, సమాజానికి, ధర్మానికి ప్రతిష్ఠా సమయం. మన దేశంలో మనం ఆచరించగలిగే, మన తీర్థక్షేత్రాన్ని సేవించగలిగే, మనశాస్త్ర ప్రకారం ఉత్సవాలు జరుపుకునే అవకాశం దొరికిన ఈ సుసందర్భంలో ఆలయ నిర్మాణం అనేది శ్రేష్ఠమైనది. ఆలయనిర్మాణంలో ఉత్తర దక్షిణ దేశాలలో కొంత తేడా ఉంది. వేసర, నాగర శైలులు ఉత్తరాన ఉన్నాయి. అయోధ్యలో నాగరశిల్ప పద్ధతిలో ఆలయనిర్మాణం, ప్రతిష్ఠ జరగబోతోంది. (పూరీజగన్నాథ్‌లో, కాశీవిశ్వానాథ ఆలయంలో ఇంకోరకమైన ప్రాకారాలు ఉన్నాయి. హిమాలయశీతలప్రదేశంలో ఆశ్చర్యంగా కేదార్ నాథ్ గుడి కట్టారు.)

**ప్రశ్న : గురువర్యా ! దేవతా విగ్రహానికి, యంత్రానికి ఉన్నటువంటి సంబంధం ఏమిటి ?**

**స్వామివారు : 'త్వయి మయి చ అన్యత్ర ఏకో విష్ణుః వ్యర్థం కుప్యసి మయి అసహిష్ణుః సర్వస్మిన్ అపి పశ్య ఆత్మానం, సర్వత్ర ఉత్సృజ భేద అజ్ఞానం – గురు చరణాంబుజ నిర్భర భక్తః సంసారాత్ అచిరాత్ భవ ముక్తః'** – ఇలా శంకరాచార్యులవారు భగవంతుడిని మనము ఇక్కడే చూడగలుగుతామని భజగోవిందంతో సహా అన్ని స్తోత్రాలలోను వివరించారు. కాని అది అందరికీ సాధ్యం కాదు కదా! అందుకే మనధర్మంలో పరమాత్మను ఒక రూపం ద్వారా సందర్శించడం జరుగుతోంది. ఇంకా ప్రాచీనకాలంలో అయితే రూప, అరూప దర్శనం ఉండేది. సాలగ్రామం, నర్మదాబాణం, కాళహస్తి స్వర్ణముఖి స్వర్ణభద్రం అనే స్పటికం ఇలాంటివి ఉండేవి. ఆ సమయంలో రూపారూపమైన విధానంలో భగవంతుని దర్శనం చేసుకుని, సేవించుకున్నారు. భక్తిలో పామరుడిగా ఉండే వాళ్ళకి, నిష్ఠ కలగాలంటే ఒక రూపం, విగ్రహం ఉండాలి అనే విధానం మన సనాతన వైదిక హిందూధర్మంలోనే ఉన్నది. విగ్రహం ద్వారా మనోనిగ్రహంతో భగవంతుని సేవించుకోవాలి. మంత్రపూర్వకంగా దానిని ప్రతిష్ఠ చేసుకొని అది మట్టి, దారువు (దారువు అంటే చెక్క. కంచిలో 35 సంవత్సరాలకు ఒకసారి తోరిగుంట నుంచి అతివరదరాజస్వామిని తీస్తారు, పూరీ జగన్నాథ్‌లో నవకళేబర ఉత్సవం చేస్తారు. కొత్త దివ్యశరీరం అప్పటికప్పుడు క్రొత్తగా నిర్మిస్తారు.) రూపం ఏదైనా, మనం స్వామిగా భావించి పూజించాలి.

మన పరమాచార్యులు శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు, మన శ్రీజయేంద్ర సరస్వతీ స్వామివారికి పీఠం బాధ్యతలన్నీ ఇచ్చిన తరువాత పాదయాత్రలో ఉన్నప్పుడు, ఉన్నచోటే భగవంతుని



ధ్యానించి, ధూపం, దీపం, నైవేద్యం, హారతులు మానసపూజగా చేసేవారు. పంచధాతువులతో ఉత్సవ విగ్రహాలు చేస్తారు. అలాగే శిలావిగ్రహాలు చేయడానికి శిలని పరిశీలిస్తారు. ఆ శిల స్త్రీ, పుం, నపుంసకమా అని శబ్దాలతో పరీక్ష చేసి ఏ దేవతకు ఏ శిలను తీసుకోవాలో శిల్పశాస్త్రం ప్రకారం నిర్ణయం తీసుకుంటారు. అమ్మవారి విగ్రహం అయితే ఒక విధంగా, మహావిష్ణువు స్వరూపం అయితే ఇంకోలా అని నిర్ణయించి విగ్రహాన్ని అందంగా చెక్కి, తరువాత శాస్త్రీయంగా ధాన్యాదివాసాలు కొంతకాలం, కొంతకాలం జలాధివాసం, పుష్పాధివాసం చేసి ప్రతిష్ఠకు ముందు పూర్తిచేస్తారు. (మరువం అని ఒక పూవు ఉంది. మరువమును సంవత్సర సాద్గుణ్యం అంటే సంవత్సరం పూజ చేయడం కోసం దాని అధివాసం చేసి దానికి పూజ చేస్తారు. అంటే పూజార్హత వచ్చిన తరువాత పూలు పూజకు, అర్చనకు వాడవచ్చు. పూలను కూడా పవిత్రం చేయడానికి కొన్ని పూజలు ఉన్నాయి. అవి కంచిపీఠంలో ప్రతి సంవత్సరం జరుగుతాయి.) అలా అయోధ్యలో విగ్రహం శాస్త్ర ప్రకారం చేసి ప్రతిష్ఠ చేయబోతున్నారు. ఇది మహత్తరమైన, గౌరవప్రదమైన కార్యం. ప్రాచీనత, సౌందర్యానికి ఇది ఒక ఆదర్శమైన కార్యక్రమం.

**ప్రశ్న : పూజ్య గురూజీ ! శ్రీరామరాజ్యం ఎలా ఉండేది ? అప్పటి ప్రజలు జీవనవిధానం ఎలా ఉండేది?**

**స్వామివారు :** 'అహమేవ మతో మహీపతేః ఇతి సర్వః ప్రకృతిష్వచింతయత్' – మహారాజుగారు నన్నే చూస్తున్నారు అనే అంత ఆత్మీయభావం రామ పరిపాలనాకాలంలో ఉండేది. (మహాస్వామివారు దర్శనం ఇస్తుండగా ఎంతమంది ఉన్నా అందరికీ వారు సందర్శనం చేసినంత సంతృప్తి కలుగేది. ఆ కటాక్షం కామాక్షీ అమ్మవారి దయా పరిపూర్ణమైన కటాక్షం.) సంక్షేమ విధానాలు అందరికీ అందే విధంగా, ప్రజాగౌరవం, ఆరోగ్యం, భక్తి, జ్ఞానం, ఆర్థిక పరిపుష్టత సమానంగా ఇచ్చేవారు. అందరికీ మంచి చేసి మనసులను జయించినవారు ఆయన. ప్రజా అవసరాలను గమనించిన మహారాజు. యుద్ధానికి కూడా సమయమిచ్చి, ఎన్నో అవకాశాలిచ్చి, రేపు రా అని చెప్పి చేశారు. భూమి నుంచి వచ్చిన సీతాదేవి యొక్క భర్త అయిన ఆయన అంతే ఓర్పుగా ఉండి అందరికీ మంచి చేశారు. సంక్షేమం, అభివృద్ధి, శాంతి అనే వాటికి ఆదర్శమైన రాములవారు ఆకలి, అనారోగ్యం, అజ్ఞానం, ఆడంబరం లేకుండా చూసుకున్నారు. ఇంత సంపద, ఐశ్వర్యం, పరాక్రమం, తేజస్సు, వర్చస్సు, అన్నీ ఉన్నా 'ఆత్మానం మానుషం మన్యే' నన్ను నేను మానవుడిగా అనుకుంటున్నాను అని చెప్పేవారు. ఒక సందర్భంలో రామం దశరథాత్మజం అనీ, ఇంకొక సందర్భంలో 'విద్ధి మాం ఋషిభిః తుల్యమ్' (నేను సాత్విక ప్రకృతి గల మహర్షిలాంటి మనిషిని మాత్రమే) అని చెప్పేవారు. ఆయన దృష్టిలో జ్ఞానమే ఆయనకి ప్రధానం.

వనవాస ప్రవేశం గురించి కాళిదాసు వర్ణిస్తూ 'వివేశ దండకారణ్యం ప్రత్యేకం చ సతాం మనః' ఆయన దండకారణ్య ప్రవేశం చేసినప్పుడు అక్కడ ఉన్న మంచివాళ్ళందరి మనస్సుల్లోకి ప్రవేశం చేశారు అని చెప్పారు. రాములవారు ఆశ్రమధర్మాన్ని పాటిస్తూ వనవాసం చేశారు. అంటే ఆకర్షణతో, ఆహ్లాదంతో అందరినీ ఆనందిపజేసే జగదానంద కారకుడు ఆయన. అలాంటి వ్యక్తిత్వం ఆర్షసంస్కృతి వల్ల సాధ్యపడుతుంది. ఏకాత్మభావాన్ని, వేదాంతభావాన్ని పాటించినవారు రాములవారు. అందుకే రామరాజ్యం అనేది గర్వరహితం, గౌరవసహితం. అలాంటి ధర్మం ద్వారా అందరి సహకారంతో మంచి జరుగుతుంది. రాములవారిని ప్రార్థిస్తూ


**'శ్రీరామచంద్రః శ్రితపారిజాతః సమస్త కల్యాణ గుణాభిరామః**
**సీతా ముఖాంభోరుహ చంచరీకః నిరంతరం మంగళమాతనోతు'**

అనే నిరంతరమైన మంగళాన్ని మనం కోరుకోవాలి. విగ్రహమూర్తి ఎలా ముఖ్యమో, స్వామి సన్నిధిలో మూలమంత్ర యంత్రం కూడా అంతే ముఖ్యం. ఆ యంత్రమహిమను శంకరాచార్యులవారు ప్రసిద్ధి చేశారు. (కామాక్షీ అమ్మవారి సన్నిధిలో 'శ్రీచక్రం స్వయంమాలికత్' అని కంచిలో వారే ప్రతిష్ఠ చేశారు. అఖిలాండేశ్వరీ అమ్మవారికి తాటంకాన్ని ప్రతిష్ఠ చేశారు. తిరుమలలోని వెంకటేశ్వర సన్నిధిలో జనాకర్షణ, ధనాకర్షణ యంత్రం శంకరాచార్యులవారు ప్రతిష్ఠ చేయడం జరిగింది. భక్తులు అవి దర్శనం చేసుకొని తద్వారా దేవతా సాన్నిధ్యం పొందాలి.) అయోధ్య బాలరాముడి సన్నిధిలో కూడా యంత్ర ప్రతిష్ఠ జరిగింది. రాములవారి మూలమంత్ర యంత్రం ఒక గొప్ప యంత్రం. ఆ యంత్ర ప్రతిష్ఠ జరిగినందువల్ల అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాము.

**ప్రశ్న : పూజ్య గురూజీ ! ప్రతిష్ఠ కలాపం ఏఏ సాంప్రదాయాలలో నిర్వహిస్తారు ?**

**స్వామివారు :** ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో 'నేత్రోన్మీలనం' అని చేస్తారు. ('కన్నులు తెరవటం') తరువాత చెవిలో 'భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః' అంటూ జడంగా ఉండే ఒక పదార్థంలో చైతన్యాన్ని తీసుకురావటం జరుగుతుంది. **'శిలాపి త్వదంఘ్రి క్షమా సంఘిరేణోః .... చైతన్యమాధత్త రామ, నరస్త్వత్ పదద్వంద్వ సేవా విధానాత్ సుచైతన్యమేతీతి కిం చిత్రమత్ర.'** రామభుజంగ ప్రయాతస్తోత్రంలో శంకరాచార్యులు స్తోత్రం చేస్తున్నారు – శిలాపి అంటే రాయి కూడా మీ యొక్క పాదస్పర్శం చేత చైతన్యాన్ని పొందింది. జడ స్వరూపంలో చైతన్యం తీసుకువచ్చినవారు రాములవారు. అలా మానవులమైన మేము మీ పాదాన్ని సేవిస్తే మాలో మంచి చైతన్యం కలగటంలో ఆశ్చర్యం ఏముంది? అని శంకరాచార్యులవారు రాములవారి గురించి చెప్పారు. విగ్రహంలో చైతన్యం రావడానికి యాగశాలలో ఒక మంచి సంకల్పంతో పూజలు నిర్వహించి, అందరికీ అనుగ్రహ, ఆశీస్సులు అందించాలని ప్రార్థనలు చేసిన తరువాత ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. ఆ చైతన్యమే సందర్శనం ద్వారా మనకి స్ఫూర్తిని, సత్సంకల్పాన్ని, శ్రద్ధని, ప్రేమ, దయా వంటి మంచి స్వభావాలను కలిగిస్తుంది. మనకి ఐహిక, ఆముష్మిక, శ్రేయస్సులను కలిగిస్తుంది. అలాంటి మంచి కార్యక్రమాన్ని ఉత్తరాయణంలో పుష్యమాసం, ద్వాదశి, మృగశీర్ష నక్షత్రం, మధ్యాహ్నకాలంలో, వారు జన్మించిన సమయంలో అందరూ మనసా వాచా కర్మణా పాల్గొని తద్వారా రాములవారి ఆశీర్వచనాన్ని పొంది భక్తిప్రపత్తులతో సేవించే అవకాశం సదుపయోగం చేసుకోవాలి.

**ప్రశ్న : జయేంద్ర సరస్వతీ స్వామివారికి అయోధ్య రామమందిర నిర్మాణం ఉద్యమ సేవధ్యానికి ఉన్నటువంటి అనుబంధం తెలియజేయండి స్వామి ?**



**స్వామివారు :** శ్రీజయేంద్రసరస్వతీ స్వామివారు ధర్మాన్ని ప్రజలలోకి, సమాజంలోకి తీసుకొనివచ్చి, యావద్భారతదేశం సంచారం చేసి ప్రచారం చేశారు. ప్రజలు మందిర నిర్మాణం చేయాలని దృఢంగా ఉన్నప్పుడు స్వామివారు ఉద్యమం కోసం ప్రచారం చేయడం, ప్రార్థన, పూజలు చేయించడం, ప్రభుత్వం – ప్రజలతో శాంతి సంవాదాలు జరపడం లాంటివి చాలా చేశారు. ఏ పనికైనా ఒక మంచి పర్యావరణం కావాలి. 86వ సంవత్సరంలో అయోధ్యలో రాములవారి సందర్శనం ప్రజలందరికీ కలిగే విధంగా విశేష ప్రయత్నం చేశారు. అప్పుడు ప్రజలకు అక్కడికి వెళ్ళి దర్శనం చేసుకునే అవకాశం కలిగింది. ఆ అవకాశం విస్తృతమై, కొత్త ఆలయం నిర్మాణమై, ఇప్పుడు ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగబోతున్నాయి. 1986వ సంవత్సరం ఫిబ్రవరిలో జయేంద్రస్వామివారు ప్రయాగక్షేత్రం నుంచి అయోధ్యకు వెళ్ళారు. అప్పుడు వారి గురుదేవులైన శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు, కంచి నుంచి రాములవారి కోసం ఛత్రచామరములు పంపించారు. మన జయేంద్రసరస్వతీ స్వాములవారు బాలరాముని



ప్రథమదర్శనం చేసుకొని మొట్టమొదటి మర్యాద క్రింద వాటిని సమర్పించారు. మందిర నిర్మాణం సంకల్పిస్తూ తులసీ రామాయణం, వాల్మీకి రామాయణం పారాయణం చేయించారు. రామజన్మభూమి ఉద్యమం విజయవంతం కావడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా, అనేక సత్సంబంధాల ద్వారా వారు చేసిన కృషి అద్భుతమైనది.

**ప్రశ్న : గురువర్యా ! ప్రపంచంలో ఉన్నటువంటి ప్రతిభారతీయుడు కూడా చాలా గర్వంగా 'మేరా భారత్ మహాన్' అని ఉచ్చరిస్తూ ఉంటారు. అసలు దాని ఆవిర్భావం ఎలా జరిగింది ?**

**స్వామివారు :** రామజన్మభూమి ఉద్యమం అనేక దశాబ్దాలుగా జరుగుతున్నది. అనేకమంది ముఖ్యమైన వ్యక్తులు దీనిలో ప్రధానపాత్ర వహించారు. (ఇప్పుడు మంచి పరిస్థితులు వచ్చి, మందిర ఉద్ఘాటన జరగబోతోంది.) ఆ సందర్భంలో అనేకమంది కంచికి రావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కృష్ణకాంత్‌గారు కూడా కంచి పరమాచార్యుల దగ్గరకి వచ్చారు. 3, 4 గంటలు కూర్చున్నారు. అప్పుడు పల్లకిలో కూర్చుని ఉన్న స్వామివారు దీనికి మంచి పరిష్కారం సుముఖంగా, ప్రశాంతంగా జరగాలి అని కోరుకున్నారు. ఆ సందర్భంలో స్వామివారు మౌనం వీడి 'మేరా భారత్ మహాన్' అనే దానిని గూర్చి చెప్పారు. అంటే భారత్ మహత్త్వపూర్ణమైంది, మంచిపనులు జరుగుతాయి అని ఆశీర్వచనం ఇవ్వడం జరిగిపోయింది. మనం ఈ సమస్య నుంచి బయటకు వస్తాము, అవసరమైన మంచి జరుగుతుంది అని ఆరోజే స్వామివారు ఆశీర్వచనం ఇచ్చినట్లు అయ్యింది.

**ప్రశ్న : అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ శుభవేళలో గురువర్యా ! మీరు భక్తి టివి ప్రేక్షకులకు ఇచ్చే సందేశం ఏమిటి?**

**స్వామివారు :** 'రామనామమే జన్మ రక్షక మంత్రం తామసము చేయక భజింపవే మనసా !' అన్నారు. ఆంధ్రదేశంలో రామభక్తి సామ్రాజ్యాన్ని త్యాగరాజస్వామి, భద్రాచలరామదాసు, అన్నమయ్య ప్రకాశింపజేశారు. తిరుమలలో గర్భగుడిలోనే రాములవారి విగ్రహం ఉంది. ప్రతి పునర్వసు నక్షత్రం రోజున అక్కడ ఊరేగింపు ఉత్సవం జరుగుతుంది. అలా తిరుమలకి రాములవారికి, ఆంధ్రదేశానికి రాములవారికి చాలా దగ్గరి సంబంధం ఉంది. గోదావరితీరంలో వారు సంచరించారు. భక్తి టివి వారు అనేక ధార్మిక, సామాజిక కార్యక్రమాలు చేస్తుంటారు. నరేంద్రచౌదరిగారి దంపతులు సకుటుంబంగా ఈ ప్రయత్నంలో ఉన్నారు. ధర్మ పరిచయం, జాగృతి విషయంలో మనకి లభ్యమైన ఆధునిక విజ్ఞానాన్ని ప్రాచీన ధర్మప్రచారానికి వాడే నిమిత్తంగా ఇలాంటి మంచి ప్రయత్నం చేస్తున్నారు. తద్వారా పిల్లలు పెద్దలూ కూడా ఇంటిలో కూర్చుని పుష్కరాల దగ్గర నుండీ అనేక విషయాలు సందర్శిస్తున్నారు. మాములుగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన వారి మనస్సులో సహజంగానే భక్తితత్త్వం అనేది ఉంది. ఆ భక్తితత్త్వాన్ని ప్రజ్వలనం చేయడానికి, ఇంకా మేలు చేయడానికి విజ్ఞానాన్ని వాడుకొని మీరు ప్రజలకు చేస్తున్న ధార్మికసేవ జయేంద్ర సరస్వతీస్వామి వారు కూడా స్వయంగా భాగ్యనగరానికి వచ్చి ప్రోత్సహించారు. ఇటువంటి కార్యక్రమాలు గురువర్యుల, పెద్దల ఆశీర్వచనంతో ఇంకా ముందుకు సాగుతూ విస్తారంగా, మంచిగా జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము.

**జయ జయ శంకర - హర హర శంకర**





# అయోధ్యకి కంచికి శ్రీరాముల వారి కాలము నుండి చాలా దగ్గర సంబంధం ఉంది

**" స్వామివారు జనవరి 2024లో ఆంధ్రజ్యోతి సీనియర్ జర్నలిస్ట్ సివిఎల్ఎన్ ప్రసాద్ గారికి ఇచ్చిన ఇంటర్వ్యూ"**

అయోధ్యతో కంచికి ఉన్న సంబంధం గురించి, భవిష్యత్తులో ధర్మప్రచారం ఎలా సాగాలనే విషయం గురించి శ్రీకంచికామకోటి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు ఆంధ్రజ్యోతి దినపత్రిక నవ్యశీర్షికకు ఇచ్చిన అనుగ్రహభాషణం.

ఆయోధ్యతో కంచికి రెండు రకాలుగా సంబంధం ఉంది. ఒకటి క్షేత్ర సంబంధం. రెండోది ఉద్యమ సంబంధం. 1980లలో రామమందిర ఉద్యమ సమయంలో జయేంద్ర సరస్వతిస్వామివారు ఉత్తరదేశ యాత్రలో ఉన్నారు. ఆ సమయంలో మేము పరమాచార్యుల వారి వద్ద ఉన్నాము. అప్పుడు ఉద్యమానికి సంబంధించిన అనేక మంది పరమాచార్యులవారిని వచ్చి కలుస్తూ ఉండేవారు. శిలాన్యాస్ సమయంలో పరమాచార్యులవారు కొన్ని ఇటుకలను పూజించి అయోధ్యకు పంపారు. ఆ తరువాతి కాలంలో జయేంద్ర సరస్వతిస్వామి ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సుబ్రహ్మణ్యస్వామి, జార్జి ఫెర్నాండేజ్‌తో సహా అనేకమంది రాజకీయనాయకులు, అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావుగారి కార్యదర్శి పి.వి.ఆర్.కె ప్రసాద్, విహెచ్‌పి అధ్యక్షుడు అశోక్‌సింఘాల్ తదితరులు వచ్చి మహాస్వామివారితో పరిష్కారం కోసం చర్చలు జరుపుతూ ఉండేవారు. ఇక 1997లో అనుకుంటా.. మేము కాశ్మీర్ యాత్రకు వెళ్ళాము. ఆ సమయంలో అయోధ్యలో కొన్ని రోజులు ఉన్నాము. అప్పుడు రామ్‌లల్లా (బాలశ్రీరాముని విగ్రహం) తాత్కాలికంగా వేసిన టెంట్‌లో ఉండేది. ఆయన భక్తులు అందరూ ఇళ్ళు కట్టుకుంటున్నారు. ఆయనకి మాత్రం తాత్కాలిక నివాసమా? ఆయనకు కూడా ఒక గొప్ప ఇల్లు ఉంటే ఎంత బావుంటుంది? అనే ఆలోచన మాకు కలిగింది. ఇప్పుడు ఆ ఆలోచన సాకారమై ఒక గొప్ప దేవాలయం నిర్మాణమైనందుకు





ఆనందంగా ఉంది.

**అయోధ్య – కాశీ రెండింటకీ సంబంధం :**

ఇటీవల మేము కాశీ వెళ్ళాము. అక్కడ నుంచి అయోధ్య, నైమిశారణ్యం వెళ్ళాము. దీని వెనకున్న అంతరార్థమేమిటంటే.. 'శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం నమామి భగవత్పాద శంకరం లోక శంకరం' అనే శ్లోకం మనం చదువుకుంటూ ఉంటాం. శ్రుతులైన వేదాలకు కేంద్రం కాశీ. ఆ వేదాలు చెప్పిన విషయాలను ఆచరించినవారు రాములవారు. వారి కేంద్రం ఆయోధ్య. ఈ విధంగా ఈ రెండు మనకు ముఖ్యమైన కేంద్రాలు అయినాయి. ఇక ధర్మం గురించి పురాణాల ద్వారా తెలుసుకుంటూ ఉంటాం. నైమిశారణ్యంలో చక్రతీర్థం అనే ప్రదేశముంది. అది కూడా చాలా ముఖ్యమైనది. దీని గురించి పురాణాలలో ప్రస్తావన ఉంది. శ్రుతి, స్మృతి, పురాణాలు – ఈ మూడింటికీ ప్రతీకగా సీతారాములని చెప్పుకోవచ్చు. ఈ మూడింటిలోను పేర్కొన్న వీరం, విక్రమం, వినయం విద్య, విశ్వాసం, వైరాగ్యం, వేదాంతం ఈ గుణాలన్నింటికీ రాములవారే ఉదాహరణ. ఆయన ధనుర్విద్యే కాకుండా అన్ని శాస్త్రాలను నేర్చుకున్నారు. ఎంత పరాక్రమశాలి అయినా అందరితోను వినయంగానే ఉండేవారు. భారతీయ ఆర్షధర్మంపై ఆయనకు అచంచలమైన విశ్వాసం ఉండేది. రాములవారు ఒక సందర్భంలో ప్రజలతో 'నన్ను మీరు ఋషులకు సమానమైన మనిషిని మాత్రమే అని తెలుసుకోండి' అంటారు. పరాక్రమానికి ప్రతీకగా నిలిచి, అపరిమితమైన అధికారం ఉండి, దాన్ని ప్రదర్శించే అవకాశం ఉండి కూడా ఆయన తన గురించి

తాను చెప్పుకున్న మాటలు అందరికీ ఆచరణీయాలు. అందుకే ఆయన రాజర్షి అయ్యారు. లౌకికం, ధార్మికం, జ్ఞానం, త్యాగం అన్నీ కలగలసిన మూర్తి ఆయన. వీటి అవసరం ఈనాడు మనకు చాలా ఉంది.

**మన ప్రార్థన, రాములవారి కృప వల్ల, న్యాయాలయం చేసిన నిర్ణయం వల్ల భవ్య మందిరం నిర్మాణం జరుగుతోంది. ప్రాణప్రతిష్ఠకు ముహూర్తం పెట్టిన జ్ఞానేశ్వరశాస్త్రి ద్రావిడ్‌గారు మన దక్షిణ భారతదేశ మూలాలు ఉన్నవారే. ఆయన ముత్తాత లక్ష్మణశాస్త్రిగారు మహాస్వామివారిని కాశీకి తీసుకువెళ్ళారు. వారి తాతగారు రాజేశ్వరశాస్త్రిగారు పెద్ద పండితులు. అనేక విషయాలు పరిశీలించి ఉత్తర దక్షిణ భారత దేశ శాస్త్రాల సమన్వయం చేసి మంచి ముహూర్తం పెట్టారు.**

### కంచితో సంబంధం :

కంచితో అయోధ్యకు రకరకాలుగా సంబంధం ఉంది. దీనిలో మొదటిది మోక్ష సంబంధం. దక్షిణదేశంలో ఉన్న ఏకైక మోక్షపురి కంచి. మిగిలిన మోక్షక్షేత్రాలైన అయోధ్య, మధుర, కాశీ, అవంతిక మొదలైనవన్నీ ఉత్తరదేశంలోనే ఉన్నాయి. ఆ విధంగా ఈ రెండింటికి క్షేత్ర సంబంధం ఉంది. ఇక రెండోది శక్తి సంబంధం. కంచి ఒక శక్తి పీఠం. శివక్షేత్రాలలో శివకంచిలోని ఏకామ్రేశ్వరుడిది పృథ్వీ క్షేత్రం. మూడోది కులదేవతా సంబంధం. సూర్యవంశ కులదేవత దేవకాళి. దశరథ మహారాజుకు కలలో కనిపించి కంచిలోని కామాక్షీ అమ్మవారిని దర్శిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని ఆదేశిస్తుంది. దశరథ మహారాజు సకుటుంబంగా కంచికి వచ్చి వారం రోజులు ఉండి, క్షేత్ర నియమాలు అన్నీ పాటించి 'కామాక్షీ తీర్థమోవర్ణః సర్వమంగళ హేతువాః' అని ప్రస్తుతిస్తాడు. దీనికి సంబంధించిన విషయాలు 'లలితోపాఖ్యానం'లో మనకు కనిపిస్తాయి. ఆ తర్వాతే దశరథుడు పుత్రకామేష్టి యాగం చేస్తాడు. ఇన్ని సంబంధాలు ఉన్నాయి కాబట్టే గత ఏడాది ఆగస్టులో జరిగిన భూమి పూజకు కంచి నుంచి మృత్తికను పంపించాం. వాటితో పాటుగా జయ, నంద, భద్ర, రిక్త, పూర్ణ మొదలైన వాస్తు దేవతల కోసం ఐదు బంగారు కాసులు పంపాము. వీటన్నింటినీ భూమి పూజలో వినియోగించారు. ఏది ఏమైనా ఎట్టకేలకు అయోధ్య రామమందిరం కథ కంచికి చేరింది. ఇది అందరి మంచి కోసమే.

### సమన్వయం :

మనదేశ సంస్కృతి ఒకటైనా కాలచక్రంలో శీతోష్ణం, ఆర్థిక వికాసం చాలా ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. ఉత్తరదేశంవారి వద్ద నిష్ఠ, నిధి ఉన్నాయి. దక్షిణంలో నిర్వహణ, నియమాలు ఉన్నాయి. వీటిని సమన్వయ పరిచి ముందుకు వెళ్ళడమే మన నవ ధర్మం. కొన్ని



నెలల క్రితం అయోధ్య వెళ్ళినప్పుడు అక్కడ భక్తుల కోసం వివిధ రాష్ట్రాలవారు నిర్మించిన భవనాలు, ఆశ్రమాలను చూశాము. మన దక్షిణదేశంలో కూడా రాములవారితో సంబంధం ఉన్న అనేక ప్రాంతాలు ఉన్నాయి. కర్ణాటకలో కిష్కింధ ఉంది. గోదావరీతీరంతో ఆయన సంచరించారనేది లోకప్రసిద్ధం. తమిళనాడు రామేశ్వరంలో ఆయన శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. కంచిపీఠం 59వ పీఠాధిపతి 'భవనామ భోదేంద్ర సరస్వతిస్వామివారు' రామనామ జపాన్ని ఒక స్ఫూర్తిగా నెలకొల్పారు. ఆయన జన్మించిన గోవిందపురమనే ప్రాంతంలో ఇప్పటికీ రామనామ దీక్ష తీసుకుంటూ ఉంటారు. ఇలా మనకు రామ భావనతో ఎప్పటి నుంచో సంబంధం ఉంది. ఇప్పుడు క్షేత్రంతో మరింత బలోపేతం అవుతోంది. యజ్ఞయాగాదులకు, వేదస్వస్తిలకు మనవారు పెట్టింది పేరు. అయోధ్య దివ్యక్షేత్రాన్ని లౌకికంగా చాలా బాగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని వసతులు కల్పిస్తున్నారు. దీనితో పాటుగా అయోధ్య ధర్మ ప్రచారానికి, శాస్త్ర ప్రచారానికి ఒక వేదిక కావాలి. చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలన్నీ ప్రభావితం కావాలి. కనీసం 500 గుళ్ళకైనా మేలు జరగాలి. ప్రజలు ప్రభావితం కావాలి. కొత్త సౌకర్యాలు ప్రాచీన శాస్త్ర సంపదతో సంతులనం కావాలి. దక్షిణ బుద్ధి, ఉత్తర శక్తి కలిసి పనిచేయాలి. అలా చేస్తేనే దేశానికి, ధర్మానికి మంచి జరుగుతుందని అందరూ గ్రహించాలి. అలా జరిగిననాడు భారతదేశం, ఆర్షధర్మం ప్రపంచానికి గురువు అవుతుంది. చక్రవర్తిగా నిలుస్తుంది.

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విజయయాత్ర విశేషాలు



శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్రసరస్వతీ స్వామివారు దుండిగల్ నుండి జనవరి 30వ తేదీ రాత్రి 8 గంటలకు జహీరాబాద్ చేరుకున్నారు. అక్కడ శ్రీ సిద్ధి వినాయక స్వామి మందిర సభ్యులు మరియు భక్తులు స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, నాదస్వరం వాద్యాలు, కోలాటాల నడుమ స్వామిని రథంలో పెద్ద ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం క్షేత్రంలోని స్వయంభూ వినాయకునికి దీపారాధన చేసి భక్తులను అనుగ్రహ భాషణంతో ఆశీర్వదించారు.





ఫిబ్రవరి 1వ తేదీ 2024 సాయంత్రం స్వామివారు మహారాష్ట్రలోని షోలాపూర్ చేరుకున్నారు. నిర్వాహకులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. ఫిబ్రవరి 3వ తేదీ శ్రీ బాలాజీ కళ్యాణమండపంలో జరిగిన పౌరసభలో స్వామివారు భక్తులను ఆశీర్వదించి అనుగ్రహభాషణం చేశారు.





ఫిబ్రవరి 4వ తేదీ పూజ్యశ్రీ స్వామివారు షోలాపూర్ నుండి పూణే చేరుకున్నారు. భక్తులందరూ సాంప్రదాయ దుస్తులలో వచ్చి, స్వామివారికి స్వాగతం పలికారు. వీర్ సావర్కర్ మార్గ్, సరస్‌బాగ్ మీదుగా శంకర్‌మఠం వరుకు ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఫిబ్రవరి 12, 2024 వరకు ఇక్కడ శ్రీమఠం శిబిరం కొనసాగింది.




ఫిబ్రవరి 6వ తేదీ సాయంత్రం పూనాలో జరిగిన 'గీతాభక్తి అమృత మహోత్సవ' కార్యక్రమాన్ని స్వామివారు వారి అనుగ్రహ భాషణంతో ఆశీర్వదించారు. ఈ సందర్భంలో శ్రీ గోవిందదేవ్ గిరిజీ 75వ జయంతి ఉత్సవం కూడా జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుండి అనేక మంది సాధువులు విచ్చేశారు. శ్రీ గోవిందదేవ్ గిరిజీ ఉపన్యసిస్తూ వారి సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణాన్ని మరియు శ్రీమఠంతో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. భగవద్గీతను విశ్వగీతగా 100 కంటే ఎక్కువ దేశాలలో ప్రచారంలో ఉన్నదని సంతోషాన్ని వ్యక్తం చేశారు. మన వైదిక






హిందూధర్మం దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలను ఏకం చేసే కారకంగా ఉందని, మనందరికీ ధార్మిక జీవితాలను గడపడానికి మార్గదర్శనాన్ని అందిస్తుందని మరియు భగవద్గీత ఒక గేట్‌వేగా పనిచేస్తుందని నొక్కి చెప్పారు. 'జ్ఞానేశ్వరి' పుస్తకాన్ని తమిళంలోకి అనువదించేందుకు పూజ్య కంచి మహాస్వామీవారు మార్గదర్శనం చేసిన తీరును ఆయన గుర్తు చేసుకున్నారు. వారం రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా వేదసభ, శాస్త్రసభలు, భజనలు మొదలైన అనేక కార్యక్రమాలు నిర్వహించారు.



**ఫిబ్రవరి 15వ తేదీ 2024** వసంతపంచమి రోజున షోలాపూర్‌లో శ్రీ శంకర్‌మఠం స్థాపనకు పూజ్యశ్రీ స్వామివారు భూమిపూజ నిర్వహించారు.



ఫిబ్రవరి 21వ తేదీ పూజ్య శ్రీ స్వామివారు శ్రీశైలం చేరుకున్నారు. ఆలయ నిర్వాహకులు, ట్రస్టీలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు ఆలయం దగ్గరి యాగశాలలో జరుగుతున్న హోమాలను, పూజలను సందర్శించి హారతులు ఇచ్చారు.









ఫిబ్రవరి 23 తేదీ పూజ్యశ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు శ్రీశైలంలోని అతిపురాతనమైన శ్రీ హఠకేశ్వర స్వామి ఆలయం మరియు పాలధార-పంచధార ప్రవాహాన్ని సందర్శించారు. జగద్గురువు ఆదిశంకరాచార్యుల శివానందలహరిలోని శ్లోకాలను స్మరించుకున్నారు.





ఫిబ్రవరి 24 తేదీ సాయంత్రం శ్రీశైలం నుండి బయలుదేరిన పూజ్యశ్రీ స్వామివారు విశ్వహిందూపరిషత్ నాయకులు శ్రీరాఘవులుగారి ఆహ్వానం మేరకు కొలుకుల గ్రామాన్ని, అక్కడి శివాలయాన్ని సందర్శించారు. ఇది త్రిపురాంతకం పట్టణం నుండి ఒక గంట దూరంలో ఉన్న శ్రీ రాఘవులుగారి స్వగ్రామం. ధార్మిక విలువల ఆవశ్యకత, సేవలు, భక్తి, మరియు చెట్ల పెంపకం పట్ల శ్రీరాఘవులుగారి అంకితభావం గురించి శ్రీ స్వామివారు అనుగ్రహభాషణం చేశారు.





ఫిబ్రవరి 25 తేదీ పూజ్యశ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామివారు మహానందికి చేరుకున్నారు. అక్కడ శ్రీ మహానందీశ్వరస్వామి దేవస్థానం నిర్వాహకులు స్వామివారికి స్వాగతం పలికారు. ఫిబ్రవరి 25, 26 తేదీలు శ్రీమఠం శిబిరం అక్కడ కొనసాగింది.



ఫిబ్రవరి 26 తేదీ సాయంత్రం పూజ్య శ్రీ స్వామివారు నంద్యాల చేరుకున్నారు. అక్కడి గాయత్రిదేవి ఆలయ నిర్వాహకులు స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.





ఫిబ్రవరి 27, 2024 తేదీ పూజ్యశ్రీ స్వామివారు ఆళ్లగడ్డ చేరుకుని అక్కడ శ్రీగాయత్రీదేవి మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటైన శ్రీమఠం శిబిరానికి భారీసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. స్వామివారు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి, అనుగ్రహ భాషణంతో ఆశీర్వదించారు. 28వ తేదీ శిబిరంలో బ్రహ్మచార్యులచే లఘుసహస్రగాయత్రీ జపం, దంపతులచే గాయత్రీ దేవి ఆరాధన మరియు వివాహ వయస్సులో ఉన్న యువతీయువకులకు స్వయంవర పార్వతీ శ్లోకపారాయణం మొదలైన కార్యక్రమాలు జరిగాయి.







ఫిబ్రవరి 28 తేదీ పూజ్యశ్రీ స్వామివారు సాయంత్రం 4:30 గంటలకు ఆళ్ళగడ్డ నుండి అహోబిలం వైపు బయలుదేరారు. సాయంత్రం 5:15 గంటలకు రుద్రవరం చేరుకున్నారు. అక్కడ మకరసంక్రాంతి నుంచి నరసింహస్వామి పార్వేట ఉత్సవం వైభవంగా జరుగుతోంది. రుద్రవరం వద్ద స్వామివారు ఉత్సవ స్వామిని దర్శించుకున్నారు. అహోబిలంమఠం నిర్వాహకులు ఆలయగొడుగు, నాదస్వరం, వేదమంత్రాలతో సాంప్రదాయ బద్ధంగా పూజ్యశ్రీ స్వామివారికి స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారిని శాలువా, పరివట్టం, మాలలతో సత్కరించారు. అనంతరం అహోబిలంమఠానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఎగువ అహోబిలం చేరుకుని స్వయంభూ నరసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ ధ్యానంలో కొంతసేపు గడిపిన తరువాత స్వామివారు చెంచులక్ష్మీ అమ్మవారి సన్నిధికి చేరుకొని అక్కడ లక్ష్మీఅష్టోత్తరనామావళితో పూజలు నిర్వహించారు. అనంతరం అమృతవల్లితాయార్ దర్శనం చేసుకున్నారు. అహోబిలంమఠం అధికారులు శ్రీ సంపత్ మరియు శ్రీ రమేష్ భట్టార్ ఈ పురాతన క్షేత్రానికి సంబంధించిన ముఖ్యమైన పురాణ కథలను మరియు అహోబిల క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అనంతరం కరివెన అన్నదాన సత్రాన్ని సందర్శించి రాత్రికి అహోబిలంమఠం ప్రాంగణానికి చేరుకున్నారు.





ఫిబ్రవరి 29 తేదీ పూజ్యశ్రీ స్వామివారు అహోబిలం నుండి కడపకు బయలుదేరారు. వెళ్లే మార్గంలో ఒక రైతు పొలం దగ్గర ఆగి, వ్యవసాయం గురించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎద్దుల బండిలో వెళ్తున్న మరో రైతు దంపతులకు కూడా ప్రసాదం అందించి, ఆశీర్వదించారు.



ఫిబ్రవరి 29 తేదీ పూజ్యశ్రీ స్వామివారు కడప చేరుకున్నారు. చిన్మయమిషన్ శ్రీలలితా పంచాయతన దేవాలయ అధికారులు వేదమంత్రాలతో, పూర్ణకుంభంతో స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. శ్రీమఠం శిబిరం మార్చి2 వరకు కడపలో కొనసాగింది.





మార్చి 2 తేదీ కడపలో నిర్మాణదశలో ఉన్న శ్రీకామాక్షీ అమ్మవారి దేవాలయాన్ని స్వామివారు పర్యవేక్షించి, సూచనలు అందించారు. భక్తులను ఆశీర్వదించారు.

మార్చి 2 తేదీ  2024 పూజ్య శ్రీ స్వామివారు సాయంత్రానికి తిరుపతి చేరుకున్నారు. 3వ తేదీ శ్రీ కంచి కామకోటి పీఠం 66వ పీఠాధీశ్వరులు శ్రీచంద్రశేఖర సరస్వతి స్వామివారి ఆరాధన తిరుపతిలో శ్రీ విజయేంద్రసరస్వతీ స్వామివారి ఆధ్వర్యంలో జరిగింది.









మార్చి 5వ తేదీన తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శ్రీ శంకరభాష్య మండపానికి (అద్వైతతత్త్వబోధన కోసం) శంఖుస్థాపన కార్యక్రమాన్ని పూజ్యశ్రీస్వామివారు సందర్శించి, అనుగ్రహభాషణంతో ఆశీర్వదించారు. వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, పూర్ణకుంభంతో స్వామివారిని స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.





**మార్చి 7వ తేదీ** తిరుపతి శంకరమఠంలో  పూజ్యశ్రీ శంకరవిజయేంద్ర సరస్వతీ స్వామివారి జయంతి మహోత్సవం జరిగింది. పూర్ణాహుతి, వేదోత్సవాల అనంతరం స్వామివారికి కంచి, తండలం మరియు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కలశతీర్థంతో అభిషేకం నిర్వహించారు.





**మార్చి 10వ తేదీ** తిరుపతి శంకరమఠంలో పూజ్య శ్రీ మహాదేవేంద్ర సరస్వతీ స్వామివారి ఆరాధన శ్రీస్వామివారి సమక్షంలో శ్రద్ధాభక్తులతో జరిగింది.



మార్చి 16వ తేదీ పూజ్యశ్రీ స్వామివారు తిరుమల శ్రీవారిని నైవేద్యవిరామ సమయంలో దర్శించుకున్నారు. ప్రజలందరూ సనాతనధర్మాన్ని ఆచరిస్తూ, సుఖసంతోషాలతో ఉండాలని భారతదేశం విశ్వగురువుగా విలసిల్లాలని భగవంతుని ప్రార్థించినట్లు మీడియావారితో వెల్లడించారు.





మార్చి 20వ తేదీ శ్రీస్వామివారు తిరుపతి నుండి కాంచీపురం చేరుకున్నారు. కంచిలో వేద మంత్రాల ఘోషతో, కామాక్షీ అమ్మవారి ప్రసాదంతో వేదపండితులు, సుమంగళులు హారతులతో స్వామివారికి భక్తితో స్వాగతం పలికారు. పూలరథాన్ని ఏర్పాటుచేసి స్వామివారిని శ్రీమఠం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్ళారు.

# శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారి ఆరాధన మహోత్సవం











మార్చి 22 తేదీ శ్రీజయేంద్ర సరస్వతి స్వామివారి ఆరాధన జరిగింది. వేదపారాయణం, సంగీత సమర్పణం, తీర్థనారాయణ పూజ ఇత్యాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అసంఖ్యాకంగా కంచికి చేరుకుని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

**శ్లో॥** ఉరరీకృత కాంచిపురీం ఉపనిషదరవిందకుహరమధుధారామ్ ॥
ఉన్న్రమ-స్తనకలశీమ్ ఉత్సవలహరీం ఉపాస్మహే - శంభోః ॥ ॥27॥

**తాత్పర్యం :-** కాంచీనగరమును తన నివాసముగా అంగీకరించిన, వేదాంతకమలము యొక్క మధ్యభాగమున ఉన్న మధుధారను, కలశములవంటి ఎత్తైన స్తనములుగల, శివుని నేత్రోత్సవముల ప్రవాహమును ఉపాసించెదము.

**బాలమనోజ్ఞా :-** ఆ కామాక్షి కాంచీనగరంలో అనాదిగా నివసిస్తోందిట. అందుకే "ఓడ్యాణపీఠనిలయా బిందుమండలవాసినీ" అని వసిన్యాది వాగ్దేవతలు స్తుతించారు. ఓడ్యాణపీఠమంటే కంచిపీఠమని. అమ్మవారి పీఠం కంచి నడిబొడ్డున ఉంటుంది కాబట్టి కంచిని ఓడ్యాణపీఠమని అంటారు. ఉపనిషత్తులనే కమలముల యొక్క మధ్య ఉండే సారము అనగా తేనెధార ఆ తల్లి. సాధకుడు అనే మధుపము అనగా తెనెటీగ ఈ పరబ్రహ్మయైన తేనెను ఆస్వాదిస్తేనే ఆ సాధనకు సార్ధకత. ఎత్తైనస్తనములు కలిగి తనను వేడిన భక్తుల ఆర్తిని తీర్చే ఆ తల్లిని, ఈశ్వరుని కన్నులకు ఎప్పుడూ పండుగను కలుగజేసే ఆ తల్లి ని ఉపాసించెదము.

**శ్లో॥** ఏణశిశు-దీర్ఘలోచనం ఏనఃపరిపంథి సంతతం భజతాం ॥
ఏకామ్రనాథ-జీవితం ఏవంపదదూరమేకం అవలంబే ॥ ॥28॥


**తాత్పర్యం :-** జింకపిల్లవలె పొడవైన కన్నులు గల, ఎల్లప్పుడు తనను నమస్కరించువారి పాపములకు శత్రువైన, 'ఈ విధముగా' అను పదమునకు దూరమైన ఒక ఏకామ్రనాథజీవితమును ఆశ్రయించెదను.

**బాలమనోజ్ఞా :-** కామాక్షీదేవి కన్నులు జింకపల్ల కన్నలవలె దీర్ఘములుగా ఉంటాయట. ఆ దృక్కులతోనే తనను నమస్కరించే వారి పాపాలను నశింపజేస్తుందట.ఆవిడ సౌందర్యాన్ని గానీ, అనుగ్రహాన్ని గానీ మరి

దేనినీ కూడా ఇంటువంటిది అని దేనితోనూ ఉపమానం చేసి చెప్పలేమట. ఏకామ్రనాథుని జీవితము ఐన ఆ కామాక్షిని ఆశ్రయిస్తాను అని భావము. అరవిందమశోకం చ చూతం చ నవమల్లికా. నీలోత్పలం చ పంచైతే పంచబాణస్య సాయకాః." అని అమరకోశం. అమ్మవారు ఈ ఐదు బాణాలను ధరించి ఉన్నారట. ఈ ఐదు కూడా చిన్నపాటి ఎరుపుదనాన్ని కలిగి ఉంటాయి. అలాగే తియ్యదనాల సారమంతా కూడా చెరకులోనే ఉంటుంది. ఆ చెరకువిల్లు కూడా కొంచెం ఎరుపుదనాన్ని కలిగి ఉంటుంది. ఇంకా ఆవిడే అరుణ." అరుణాం కరుణా తరంగితాక్షీమ్...." అని అమ్మవారిని అరుణిమ వర్ణంతో భావిస్తారు. ఉదయిస్తున్న సూర్యుని వర్ణం కూడా ఎరుపే. 'ఉద్యద్భాను సహస్రాభా' ఆ తల్లి. అలాగే సత్వరజస్తమోగుణాలలో రజోగుణము యొక్క వర్ణం ఎరుపు. ఈ గుణాల నుండే వర్ణాలనేవి ఏర్పడ్డాయి. అరుణస్య భావః ఆరుణ్యం. రజోగుణము యొక్క ప్రభావం వలననే సృష్టి ఏర్పడుతోంది. ప్రాణులు ఈ మూలప్రకృతి నుండే ఉద్భవిస్తున్నాయి. అటువంటి ఆరుణ్యభేదమైన మూలప్రకృతిని నేను ధ్యానిస్తానని మూకమహాకవి అమ్మవారిని వర్ణిస్తున్నారు.

# శ్రీ కామకోటివాణి

## ప్రత్యేక సంచిక




వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



### Bank Details:

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

### Subscription

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt

koo @kamakoti

Koo

www.kamakoti.tv

www.kanchimuttseva.org

ESEVA PORTAL

for Online Puja Bookings &
Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA


దేవే దేహే చ దేశే చ భక్త్యారోగ్యసుఖప్రదమ్ ।
బుధపామరసేవ్యం తం శ్రీజయేంద్రం నమామ్యహం ॥